
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.5 । కనిష్ఠం 26.5



నిజామాబాద్

జిల్లా వార్తలు

7

గురువారం 13 జూన్ 2024



* జిల్లాలో మోగిన బడిగంటలు
* పునఃప్రారంభమైన పాఠశాలలు
* మొదటి రోజు నామమాత్రంగా విద్యార్థుల హాజరు
* సమస్యలతో స్వాగతం పలికిన ప్రభుత్వ పాఠశాలలు

తొలిరోజు అంతంతే..









నిజామాబాద్ అర్బన్, జూన్ 12: జిల్లాలో పాఠశాలలు బుధవారం పునఃప్రారంభమయ్యాయి. వేసవి సెలవుల అనంతరం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు తిరిగి తెరుచుకున్నాయి. తొలి రోజు విద్యార్థుల హాజరు శాతం అంతంతమాత్రంగానే ఉంది. ప్రైవేటు పాఠశాలల్లో హాజరు మెరుగ్గానే ఉన్నా.. ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. మరో వారం రోజుల పాటు హాజరుశాతం తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయి. మొదటి రోజు కొన్ని పాఠశాలలు మధ్యాహ్నం వరకే తరగతులు నిర్వహించాయి. సుమారు 45 రోజుల పాటు ఆటపాటలతో ఇంటి పట్టునే గడిపి, సెలవుల్లో అమ్మమ్మలు, తాతయ్యలు, ఇతర బంధువుల ఇండ్లల్లో గడిపిన విద్యార్థులు మళ్లీ బ్యాగులు వేసుకొని స్కూల్ బాట పట్టారు. కొత్తగా పాఠశాలలకు వెళ్తున్నామన్న ఉత్సాహం కొందరిలో ఉండగా పై తరగతులకు వెళ్తున్నామన్న సంతోషంతో కొంత మంది విద్యార్థులు పాఠశాలలకు వెళ్లారు.

పుస్తకాలు, యూనిఫాంల పంపిణీ

ప్రభుత్వ పాఠశాలల్లో తొలిరోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. జిల్లాకు సంబంధించి 90 శాతం వరకు పాఠ్యపుస్తకాలు పాఠశాలలకు చేరుకోగా 90వేలకు పైగా యూనిఫాంల కుట్టడం పూర్తికావడంతో జిల్లాలో చాలా పాఠశాలల్లో తొలి రోజే పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు.

సమస్యల స్వాగతం

మన ఊరు మన బడి కింద ఎంపికైన పాఠశాలల్లో పనులు అసంపూర్తిగానే మిగిలిపోగా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు ఇంకా జిల్లాలో కొనసాగుతున్నాయి. చాలాచోట్ల పనులు పూర్తికాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో చాలా చోట్ల పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో విద్యార్థులు ఇక్కట్లు పడ్డారు. కొన్ని చోట్ల తరగతి గదులు సరిపోకా చెట్ల కిందే పాఠాలు చెప్పే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికాయి.







నిజామాబాద్ నుంచి వరంగల్‌కు


అదనంగా రెండు డీలక్స్‌లు

* నేడు ప్రారంభించనున్న ఆర్టీసీ ఆర్ఎం

సుభాష్‌నగర్, జూన్ 12: నిజామాబాద్ నుంచి వరంగల్‌కు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అదనపు డీలక్స్ బస్సులను నడుపనున్నట్లు నిజామాబాద్ రీజియన్ మేనేజర్ జానిరెడ్డి తెలిపారు. గురువారం నుంచి ఈ బస్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. నిజామాబాద్ నుంచి ఉదయం 6.00, 6.45, 7.30, 8.00, 8.30, 9.00, మధ్యాహ్నం 1.00, 1.45, 2.30, 3.00, 3.30, సాయంత్రం 4గంటలకు, వరంగల్ నుంచి నిజామాబాద్‌కు ఉదయం 6.00, 6.45, 7.30, 8.00, 8.30, 9.00, మధ్యాహ్నం 1.00, 1.45, 2.30, 3.00, 3.30, సాయంత్రం 4గంటలకు బయలుదేరునని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జీసీడీవో డిప్యూటేషన్ రద్దు

నిజామాబాద్ అర్బన్, జూన్ 12: సమగ్ర శిక్ష అభియాన్‌లో జీసీడీవో (జెండర్ అండ్ ఈక్విటీ) కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న వనిత డిప్యూటేషన్‌ను రద్దు చేస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కోఆర్డినేటర్లను తిరిగి సొంత శాఖలకు కేటాయిస్తూ ఆదేశాలు ఇచ్చారు. మూడేళ్లుగా జెండర్ అండ్ ఈక్విటీ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న వనిత పదవీకాలం ఏప్రిల్ 15తో ముగియగా ఎన్నికల కోడ్ కారణంగా ఇన్నిరోజులు కొనసాగించారు. ఎన్నికల కోడ్ ముగియడంతో విద్యాశాఖ కమిషనర్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కోఆర్డినేటర్లను తొలగిస్తూ ఆదేశాలు ఇచ్చారు. తొలగించిన వారిని తిరిగి అదే స్కూల్‌లో పోస్టింగ్‌లు ఇవ్వాలని లేదంటే అదే మండలంలో లేదా పక్క మండలంలో పోస్టింగ్ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు.



ఉద్యోగుల చూపు బదిలీల వైపు!

* ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులకు సర్కారు శ్రీకారం
* గట్టి ప్రయత్నాల్లో ఉద్యోగులు, అధికారులు
* అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతల ద్వారా సిఫారసులు

నిజామాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం బదిలీల ప్రక్రియ మొదలు పెట్టగానే ఉద్యోగి నుంచి అధికారుల వరకు క్యూ కడుతున్నారు. తమకు నచ్చిన ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. పదోన్నతులు కూడా కల్పిస్తుండటంతో కీలకమైన పోస్టుల్లోకి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల, నేతల చుట్టూ తిరుగుతున్నారు. పూర్తిస్థాయిలో ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ మొదలు కావడంతో మిగతా శాఖల ఉద్యోగులు పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులతో పాటు రాష్ట్రస్థాయిలో ఉన్న మంత్రులను, ఇతర నేతలను కలుస్తూ సిఫారసు లేఖలను తీసుకుంటున్నారు. తమ హెచ్‌వోడీలతో పరిశీలించాలని అందజేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో అన్ని శాఖల ఉద్యోగులు బదిలీ కానుండటంతో పెద్ద ఎత్తున పైరవీలను ఉద్యోగులు కొనసాగిస్తున్నారు. దీర్ఘకాలికంగా ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు ఎన్నికల విధుల్లో ఇతర జిల్లాలకు వెళ్లిన వారిని ఎక్కువ మొత్తంలో బదిలీలు చేయనుండటంతో పూర్తిస్థాయిలో ఈ ప్రయత్నాలను ఉద్యోగులు, అధికారులు కొనసాగిస్తున్నారు. ఎస్సై, సీఐ, డీఎస్పీ స్థాయి అధికారులు తమకు నచ్చిన సబ్‌డివిజన్‌లకు వెళ్లేందుకు పెద్దఎత్తున పైరవీలు కొనసాగిస్తున్నారు. అధికార నేతల చుట్టూ అన్ని శాఖల, మండల, డివిజన్ స్థాయి అధికారులు తిరుగుతూ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు షెడ్యూల్ విడుదల

ఇప్పటికే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం ఒకటి రెండు రోజుల్లో మిగతా శాఖల ఉద్యోగుల బదిలీలకు కూడా ఉత్తర్వులు జారీ చేయనుంది. బదిలీలతో పాటు పదోన్నతులు కూడా పూర్తి చేసి కీలకమైన ప్రాంతాల్లో పోస్టింగ్‌లను ఇవ్వనుంది. ఎన్నికల్లో భాగంగా ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన మండల, డివిజన్ స్థాయి అధికారులతో పాటు దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయనున్నారు. మూడేళ్లు దాటిన ఉద్యోగులకు కూడా ఈ బదిలీల్లో అవకాశం ఇవ్వనున్నారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం, రాష్ట్ర స్థాయిలో పలు పథకాలను అమలు చేస్తుండటంతో పూర్తిస్థాయిలో బదిలీలు చేపట్టడంతో పాటు పనిచేసే వారికి కీలక పోస్టింగ్‌లను ఇచ్చేందుకు సిద్ధమవుతుంది. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో కీలకమైన రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్స్, వాణిజ్య పన్నులు, ఆబ్కారి శాఖలతో పాటు ఇంజనీరింగ్ శాఖల్లో కీలకంగా పనిచేస్తున్న ఎక్కువ మంది ఉద్యోగులు ఈ బదిలీ కానున్నారు. కొంత మంది అధికారులు పదోన్నతి కోసం రెండు మూడు ఏళ్ల నుంచి ఎదురు చూస్తుండగా మరికొంత మంది అధికారులు నాలుగైదు సంవత్సరాల నుంచి ఎదురు చూస్తున్నారు. అన్ని శాఖల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులను ఇవ్వడంతో పాటు పదోన్నతులు కూడా పూర్తి చేసి పోస్టింగ్‌లు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించడంతో ఉద్యోగులు, అధికారులు కూడా ప్రయత్నాల్లో ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మొదటి సారిగా బదిలీలకు శ్రీకారం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం మొదటి సారిగా బదిలీలకు శ్రీకారం చుట్టడంతో ఎక్కువ మంది ఉద్యోగులు, అధికారులు ఉపయోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఒకసారి బదిలీ చేస్తే మూడేళ్ల వరకు మళ్లీ బదిలీ అయ్యే అవకాశం ఉండకపోవడంతో ముందస్తుగా ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటం వల్ల ఆ పార్టీ ప్రజాప్రతినిధుల చుట్టూ ఉద్యోగులు, అధికారులు తిరుగుతున్నారు. ఆయా మండలాలు, డివిజన్‌లలో తాము పనిచేసిన విధానాన్ని వివరిస్తూ ముఖ్యమైన మండలాల్లో అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. కొంత మంది ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను తీసుకుంటూ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఉపాధ్యాయుల షెడ్యూల్ ఇప్పటికి విడుదల కాగా అన్ని శాఖల బదిలీ, పదోన్నతుల షెడ్యూల్ విడుదల కానుండటంతో ముందస్తుగా ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

జిల్లాల నుంచి ఇంటెలిజెన్స్ నివేదిక

ప్రభుత్వం అన్ని జిల్లాల నుంచి ఇప్పటికే ఇంటెలిజెన్స్ నివేదికను తీసుకోవడం వల్ల గత ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పిన అధికారులను పక్కనబెట్టి కొత్త టీమ్‌ను ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో డివిజన్, జిల్లాస్థాయిలో కీలకమైన శాఖల్లో పనిచేసిన అధికారులతో పాటు మండల స్థాయిలో కీలకంగా ఉన్న అధికారులు కూడా బదిలీ కానున్నారు. ఎన్నికల్లో భాగంగా శాసనసభ ఎన్నికల సమయంలో తహశీల్దార్లు, ఎస్సైలు, సీఐలు, ఆర్‌డీవోలు, డీఎస్పీలు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లారు. వీరు కూడా ఈ బదిలీల్లో సొంత జిల్లాలకు రానున్నారు. ఎన్నికల బదిలీలతో పాటు సాధారణ బదిలీలకు కూడా అవకాశం ఉండటంతో అన్ని మండల, డివిజన్, జిల్లా స్థాయిలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ నుంచి సూపరింటెండెంట్‌ల వరకు బదిలీలు కానున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా సాధారణ బదిలీల్లో పదోన్నతుల ఆధారంగా 30 నుంచి 40 శాతం లోపు ఉద్యోగులను బదిలీ చేయనున్నారు. ఇప్పటికే ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతుండగా మిగతా శాఖల బదిలీ ఉత్తర్వులు వెలువడనుండటంతో ఉద్యోగులు, అధికారులు గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు.

ముఖ్యమైన సబ్ డివిజన్లకు పోలీసుల యత్నాలు

జిల్లాలో పనిచేస్తున్న ఎస్సైలు, సీఐలు ముఖ్యమైన సబ్ డివిజన్‌లకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదాయం ఎక్కువగా ఉండే పోలీస్ స్టేషన్‌లో పోస్టింగ్ వచ్చేందుకు నేతలను కలుస్తున్నారు. తమ సొంత జిల్లాల ప్రజాప్రతినిధుల ద్వారా కూడా ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. జోన్, మల్టీజోన్ పరిధిలో బదిలీలు జరుగనుండటంతో ఉన్నతాధికారులకు సిఫారసులు చేపించుకుంటూ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. రెవెన్యూ శాఖలో పదోన్నతుల ప్రక్రియ మొదలు కానుండటంతో డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లుగా పదోన్నతులు రానుండటంతో ముందస్తుగా లిస్టులో ఉన్నవారు గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు. బదిలీలతో పాటు పదోన్నతి రాగానే జిల్లాలో కీలక మండలాలకు వెళ్లేందుకు ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. సబ్ డివిజన్ స్థాయిలో పనిచేస్తున్న అధికారులు కూడా ఎన్నికల సమయంలో రావడం వల్ల కొంత మంది సిటీకి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తుండగా మరికొంత మంది ఇతర జిల్లాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. పూర్తిస్థాయిలో ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ వెలువడగానే అన్ని శాఖల వారు సీనియారిటీని ఖరారు చేసి బదిలీలు చేయనుండటంతో ముందస్తుగా ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. అన్ని శాఖల బదిలీలకు ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరిస్తే జిల్లా నుంచి పెద్ద మొత్తంలో అధికారులు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లనుండగా ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న వారు జిల్లాకు వచ్చే అవకాశం ఉంది.

కోడ్ ముగిసినా.. తొలగని ముసుగు

నందిపేట, జూన్ 12: పార్లమెంట్ ఎన్నికల సమయంలో కనిపించిన అధికారుల హడావిడి ఎన్నికల అనంతరం కనిపించడం లేదు. కోడ్ కూసింది అనగానే అన్ని శాఖల అధికారులు రోడ్లపైకి వచ్చి వాహనాలు తనిఖీ చేయడం, బ్యానర్లు చించి వేయడం, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడం, మత పరమైన తోరణాలను తొలగించడం, గోడలపై ఉన్న రాతలను తుడిచేవేయడం చేస్తుంటారు. కానీ ఎన్నికల కోడ్ ముగిసి వారం రోజులైనా.. జిల్లాలోని నందిపేట మండలం తల్వేద గ్రామంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్‌టీ రామారావు విగ్రహానికి ముసుగు తొలగించలేదు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ మార్చి 16వ తేదీ రాత్రికి అమలులోకి వచ్చింది. అదే కోడ్‌ను జూన్ 6న రాత్రికి ఎత్తివేశారు. అయినా అధికారులు ముసుగు తొలగించడం లేదు.



తల్వేదలో ముసుగుతో ఉన్న ఎన్‌టీ రామారావు విగ్రహం



* ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
* నాణ్యమైన బోధన,మౌలిక సదుపాయల కల్పన : కలెక్టర్

విద్య,వైద్య రంగాలకు సముచిత ప్రాధాన్యం

బోధన్‌రూరల్, జూన్ 12: రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం సముచిత ప్రాధాన్యం కల్పిస్తుందని, ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతున్నామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ ప్రాథమికోన్నత పాఠశాల, రాకాసిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యబోధనను అందించడంతో పాటు మౌలిక సదుపాయలను మెరుగుపర్చేందుకు కృషి చేస్తుందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటను పురస్కరించుకుని విద్య సంవత్సరం పునఃప్రారంభం మొదటి రోజే విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను ఎమ్మెల్యే, కలెక్టర్ పరిశీలించారు. విద్యారంగాన్ని మరింత అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యా బోధనతో పాటు అన్ని మౌలిక సదుపాయలు కలిగిన ప్రభుత్వ బడులలో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. జిల్లాలోని 158 ప్రభుత్వ బడులు 10ఫలితాల్లో వందకు వందశాతం ఉత్తీర్ణత సాధించాయని, 103మంది విద్యార్థి, విద్యార్థులు 10గ్రేడ్ పాయింట్‌లు సాధించారని కలెక్టర్ తెలిపారు. జిల్లా సగటు ఉత్తీర్ణత 93.72శాతం నమోదైందని అన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రస్తుత విద్యాసంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాల సాధన దిశగా అంకిత భావంతో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ తోడ్పాటుతో జిల్లాలో బడులు పునఃప్రారంభం అయిన మొదటి రోజే 1,12,000 మంది విద్యార్థి, విద్యార్థులకు ఏకరూప దుస్తులతో పాటు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లు అందించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లను కుట్టించే బాధ్యతలను స్వయం సహాయక మహిళ సంఘాలకు ఇవ్వడం జరిగిందని దీని వల్ల మహిళ సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలన్నదే ప్రభుత్వ సంకల్పం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌వీ.దుర్గాప్రసాద్, బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, రాష్ట్ర సహకార సంఘాల అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట రమణ, ఎంఈవో నాగనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫాంలను పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఉత్తీర్ణత శాతం పెంచాలి..

ఎడపల్లి: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రతి సబ్జెక్టులో 75 శాతానికి పైగా మార్కులు రావాలని, ఉపాధ్యాయులు విద్యార్థులకు చక్కగా అర్థమయ్యే విధంగా బోధన చేయాలని ఆయన సూచించారు. ఏదైనా సబ్జెక్టు పిల్లలకు అర్థం కాక పోతే స్పెషల్ క్లాసులు తీసుకోవాలన్నారు. పాఠశాలకు కావాలసిన మౌళిక సదుపాయాలు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



ఈనెల 14న పీడీఎస్ బియ్యం వేలం

వేల్పూర్, జూన్ 12: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 14న పీడీఎస్ బియ్యానికి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సరిత తెలిపారు. వేలంలో పాల్గొనబోయే వారు నిబంధనల ప్రకారం దారవత్ రూ.20వేల బ్యాంక్ డీడీ ద్వారా చెల్లించాలని సూచించారు. 1720.83 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్లూర్ గ్రామంలోని శ్రీకృష్ణ అగ్రో ఇండస్ట్రీస్‌లో, 763.10 క్వింటాళ్ల బియ్యాన్ని పచ్చలనడ్కుడలోని ఏబీఎల్ అగ్రో ఇండస్ట్రీస్‌లో, 587 క్వింటాళ్ల బియ్యాన్ని మోతె గ్రామంలోని సూర్య ఆగ్రో ఇండస్ట్రీస్‌లో భద్రపర్చడం జరిగిందని తహసీల్దార్ తెలిపారు.

వాహనాల తనిఖీ

ఎడపల్లి, జూన్ 12: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ, సరైన ధ్రువపత్రాలు, హెల్మెట్ ధరించకుండా నడిపిన వాహనాలను, మైనర్లు నడిపిన వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ రూరల్ సీఐ నరేష్, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, ఎస్సై వంశీకృష్ణా రెడ్డిలతో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నియంత్రిద్దాం'

పెద్దబజార్, జూన్ 12: దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నియంత్రించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ తెలిపారు. బుధవారం నగరంలోని డీఎం హెచ్‌వో కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్లు, యూనిట్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి హ్యాబిటేషన్ పరిధిలో హౌస్ హోల్డ్ పరిధిలో దోమల నియంత్రణ జరగడానికి ఆశాకార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఇంటింటికి తిరిగి సమాచారాన్ని తెలియజేయాలన్నారు. ఉపకేంద్ర స్థాయిలో, గ్రామ పంచాయతీ స్థాయిలో, పీహెచ్‌సీ స్థాయిలో, వివిద శాఖల సహకారంతో గ్రామసభలు, ఉపకేంద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో వివిధ సమావేశాల్లో దోమల ద్వారా వ్యా పిం చే వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు లాంటి వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ప్రజలందరిని దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకునేలా వివరించాలన్నారు.

బాన్సువాడలో వృద్ధురాలి దారుణ హత్య

బాన్సువాడ, జూన్ 12 : బాన్సువాడలో వృద్ధురాలు దారుణ హత్య కలకలం రేపింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో వృద్ధురాలిని గొంతు కోసి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. దుండగులు బాన్సువాడ మండలం తాడ్కూరు గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నివాసముంటున్న ఉప్పరి సాయవ్వ (65) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు సాయి గొంతుకోసి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ విషయం తెలిసిన స్థానికులు బాన్సువాడ పోలీసులకు సమాచారం అందించడంతో డీఎస్పీ సత్యనారాయణ పట్టణ సీఐ కృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని హత్యకు గల కారణాలను పరిశీలిస్తున్నారు. నగల కోసమే హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం?

నీట్-2024పై రగడే కారణం!.. తెలంగాణలో 56 కాలేజీల్లో 8,515 ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. నీట్-2024పై దేశ వ్యాప్తంగా జరుగుతున్న రగడే ఇందుకు కారణం. నీట్ మార్కులపై ఇప్పటికే సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. నీట్-2024ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిల్‌ను కోర్టు తోసిపుచ్చింది. కానీ, నీట్ విషయంలో మరిన్ని కేసులు పడే అవకాశం ఉందని, విషయం అంత త్వరగా తేలేట్లుగా కనిపించడం లేదని జాతీయ వైద్య విద్య కమిషన్(ఎన్‌ఎంసీ) అధికారులు రాష్ట్ర వైద్య విద్య ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. మరోపక్క, దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, వాటిలోని సీట్ల వివరాలను ఎన్‌ఎంసీ తన వెబ్‌సైట్‌లో పెట్టింది. విద్యార్థులు ఆయా కళాశాలల్లోనే చేరాలనే పేర్కొంది. ఎన్‌ఎంసీ వెబ్‌సైట్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కలిపి తెలంగాణలో 56 వైద్య కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.

కొత్త కాలేజీల సంగతేంటో?

రాష్ట్రం ప్రభుత్వం దరఖాస్తు చేసిన కొత్త వైద్య కళాశాలల అనుమతిపై ఎన్‌ఎంసీ ఏటూ తేల్చడం లేదు. అనుమతి ఇస్తారో ? ఇవ్వరో కూడా స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కొత్త కళాశాలల్లో ఈ ఏడాది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం అనుమానంగానే ఉంది. గద్వాల, వరంగల్(నర్సంపేట్), యాదాద్రి, మేడ్చల్ (కుత్బుల్లాపూర్), నారాయణపేట్, ములుగు, మెదక్, రంగారెడ్డి(మహేశ్వరం) జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు- సెప్టెంబరులో ఎన్‌ఎంసీకి దరఖాస్తు చేసింది. ఆయా కళాశాలలను వర్చువల్‌గా, స్వయంగా తనిఖీ చేసిన ఎన్‌ఎంసీ బృందాలు పలు లోపాలను ఎత్తి చూపి వాటిని సరిచేసుకోవాలని సూచించాయి. ఆ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ లోపాలను సవరించింది. అయితే వైద్య కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్‌ఓపీ) ఇచ్చేముందు ఎన్‌ఎంసీ బృందాలు మరోమారు తనిఖీ చేస్తాయి. మరికొద్ది రోజుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఎన్‌ఎంసీ బృందాలు ఇప్పటిదాకా మళ్లీ తనిఖీలకు రాలేదు. నిజానికి, తాము ఎత్తిచూపిన లోపాలను సరి చేసుకున్నట్టు చూపించిన తర్వాత వాటికి సంతృప్తి చెందితేనే ఎన్‌ఎంసీ అనుమతి ఇస్తుంది. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే ప్రభుత్వం అప్పీలు చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వ కళాశాల కాబట్టి సర్కారే గ్యారంటీగా ఉండి లోపాలను సవరించుకుంటామని లిఖితపూర్వక హామీనిస్తుంది. దాంతో ఎన్‌ఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. ఈ వ్యవహారానికి 20-30 రోజుల సమయం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. దీంతో త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ వైద్యవిద్య సంచాలకులు ఎన్‌ఎంసీకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎన్‌ఎంసీ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. మరోపక్క, అనుమతుల విషయమై కొన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలు ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి చర్చినట్టు సమాచారం.

గ్రూప్-1 మెయిన్స్ 7 రోజులు

(మొదటిపేజీ తరువాయి)

మీడియంలోనే రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఏ మీడియంలో రాసేదీ తెలపాల్సి ఉంటుంది. ఒక పరీక్ష తెలుగులో, మరో పేపర్‌ను ఇంగ్లిష్‌లో రాయడానికి వీల్లేదు. అలా వేర్వేరు మాధ్యమాల్లో రాసినవారి పేపర్లను పరిగణనలోకి తీసుకోరు. రాష్ట్రంలో సుమారు 563 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నారు. అందులో ఉత్తీర్ణులైనవారిని.. ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థుల చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేయనున్నారు. మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచే అభ్యర్థులను పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ నియామకాల్లో ఏలాంటి ఇంటర్వ్యూలూ ఉండవు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన వివరాలను కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

ఇదీ షెడ్యూలు

తేదీ	పేపర్
అక్టోబరు 21	జనరల్ ఇంగ్లిష్
అక్టోబరు 22	జనరల్ ఎస్సే (పేపర్-1)
అక్టోబరు 23	చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ (పేపర్-2)
అక్టోబరు 24	ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం-గవర్నెన్స్ (పేపర్-3)
అక్టోబరు 25	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ (పేపర్-4)
అక్టోబరు 26	సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ (పేపర్-5)
అక్టోబరు 27	తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ (పేపర్-6)

- పరీక్షల తొలిరోజు అయిన అక్టోబరు 21న క్వాలిఫైయింగ్ టెస్ట్ (జనరల్ ఇంగ్లిష్ పరీక్ష) నిర్వహించనున్నారు. అనంతరం ఇతర పేపర్ల పరీక్షలను నిర్వహిస్తారు. క్వాలిఫైయింగ్ టెస్ట్ కాకుండా మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లకు పరీక్షలను నిర్వహిస్తున్నారు.
- పరీక్షలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల హెచ్‌ఎండీఏ పరిధిలోనే జరుగుతాయి.
- ప్రతిపేపర్‌లోనూ 150 మార్కులకు ప్రశ్నలుంటాయి.
- అభ్యర్థులు అన్ని పేపర్లూ రాయాల్సి ఉంటుంది. ఏ ఒక్క పరీక్షకు గైర్హాజరైనా ఆ అభ్యర్థులు రాసిన ఇతర పేపర్లను పరిగణనలోకి తీసుకోరు.
- క్వాలిఫయింగ్ పరీక్షను 10వ తరగతి ప్రమాణాలతో నిర్వహిస్తారు. ఇతర పేపర్ల పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను ఇప్పటికే ప్రకటించారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ కీ విడుదల

ఈ నెల 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కీని విడుదల చేశారు. గురువారం (13వ తేదీ) నుంచి 17వ తేదీ మధ్య ఈ కీ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కీపై అభ్యంతరాలుంటే.. 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాల్సిందిగా అభ్యర్థులకు అధికారులు సూచించారు.

ఔటర్.. బంగారు బాతే!

వాహనాల రద్దీతో నెల నెలా పెరుగుతున్న ఆదాయం

- ఏప్రిల్‌లో రూ.60 కోట్లు..
- మే నెలలో 62.7 కోట్ల రాబడి



హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు.. ఆదాయ పరంగా బంగారు బాతు అన్నది స్పష్టమవుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీతో ఆదాయం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా హెచ్ఎండీఏ అధికారులు ఊహించని స్థాయిలో రాబడి వస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చే సందర్భంలో ఓ ప్రైవేటు ఏజెన్సీ మదింపు చేసిన ఆదాయ అంచనాలన్నీ తలకిందులవుతున్నాయి. అప్పుడు.. ఏడాదికి 2శాతం నుంచి 3శాతం వరకు ఆదాయం పెరుగుతుందని అంచనాలు వేయగా, ప్రస్తుతం ఒక్కో నెలకే 4శాతానికి పైగా పెరుగుతోంది. టోల్ చార్జీలు పెంచకముందే ఆదాయం ఈ స్థాయిలో పెరుగుతుండడంతో.. చార్జీల పెంపుతో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఔటర్ ఆదాయంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు అక్షరసత్యాలు అని నిరూపితమవుతున్నాయి. గతేడాది ఔటర్ రింగ్ రోడ్డును హెచ్ఎండీఏ గత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏటేటా భారీ ఆదాయాన్ని సమకూర్చే ఔటర్‌ను చాలా తక్కువ బిడ్‌కు 30 ఏళ్లకు లీజుకివ్వడాన్ని ప్రస్తావిస్తూ.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతోపాటు ఔటర్‌పై ఏటా పెరిగే ఆదాయ, వ్యయాలను అంచనా వేసి చూపిస్తూ.. రాష్ట్రానికి బంగారు బాతు లాంటి ఔటర్‌ను ప్రైవేటుపరం చేయడాన్ని పేర్కొంటూ 'బంగారు బాతు.. బలి' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతోపాటు అప్పటి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. విపక్షాలకు అస్త్రంగా మారాయి. ఆ కథనాలన్నీ ఇప్పుడు అక్షరసత్యాలుగా నిరూపితమవుతున్నాయి.

టోల్ చార్జీల పెంపుతో సంబంధం లేకుండానే

ఔటర్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించిన సందర్భంలో ఆదాయాన్ని మదింపు చేసిన ఏజెన్సీ. ఏటా 2శాతం నుంచి 3శాతానికి అటు, ఇటుగా రాబడి పెరుగుతుందని అంచనాలు వేసింది. ముఖ్యంగా హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) ప్రకారం ఏటా టోల్ చార్జీల్లో చోటుచేసుకునే 4శాతం నుంచి 5శాతం పెంపుదల మేరకే ఆదాయం పెరుగుతుందని ఆ ఏజెన్సీ తేల్చింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చే టోల్ చార్జీలతో ఆ ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరుగుతుందని హెచ్ఎండీఏ అధికారులు కూడా అంచనాలు వేశారు. కానీ, ప్రస్తుతం టోల్ చార్జీలు పెంచకుండానే ప్రతి నెలా ఆదాయం పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.60.2 కోట్ల ఆదాయం రాగా, మే నెలలో రూ.62.7 కోట్లు వచ్చింది. అంటే దాదాపు రూ.2.5 కోట్లు పెరిగింది. ఒక్క నెలకే 4.2 శాతం పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల గతేడాది నుంచి కొనసాగుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో ఆ మేరకు ఆదాయం పెరుగుతోంది. కాగా, డబ్ల్యూపీఐ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచే పెరగాలి. కానీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని పెంచకుండా నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో టోల్ చార్జీలు పెంచుకోవడానికి అవకాశం కల్పించారు. దాంతో ఈ చార్జీలు 4శాతం నుంచి 5శాతం మేర పెరిగాయి. ఇందుకు అనుగుణంగా ఆదాయం పెరుగుతుందని, వాహనాల రద్దీ ద్వారా వచ్చే ఆదాయం అదనంగా ఉంటుందని హెచ్ఎండీఏ- హెచ్‌జీసీఎల్‌కు చెందిన ఓ అధికారి తెలిపారు.

నేడు లాసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లాసెట్ ఫలితాలను ఈ నెల 13వ తేదీన విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గురువారం సాయంత్రం 3.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు.

నేటి నుంచి రెండోదశ దోస్త్

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించి 13వ తేదీ నుంచి రెండో దశ దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. మొదటి దశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 15వ తేదీలో ముగియనుంది. 14,15వ తేదీల్లో అభ్యర్థులు తమ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ అర్బన్, జూన్ 12: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని, కేంద్ర ప్రభుత్వం కూడా పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించే సంకల్పంతో పనిచేస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. బుధవారం విద్యాసంవత్సరం ప్రారంభమైన సందర్భంగా అర్సపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాంలను నగర మేయర్ దండు నీతూకిరణ్‌తో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సరిపడా నిధులు తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికై కృషి చేస్తానన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఉన్నతమైన లక్ష్యసాధన ఉన్నప్పుడే ఉన్నతమైన శిఖరాలను అవరోధించగలమని దేశభవిష్యత్తు నేటి బాలల పైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 15వ డివిజన్ కార్పొరేటర్ లావణ్య, ఎంఈవో రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటనారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

● నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్పల్లి, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధిస్తున్నట్లు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు రామడుగు గ్రామంలో జరిగిన వివిధ అభివృద్ధి పనుల్లో ఆయన పాల్గొన్నారు. ధర్పల్లిలో జరిగిన కార్యక్రమంలో రూ.కోటి 30 లక్షలతో నిర్మించిన అదనపుతరగతి గదులతో పాటు వంట గదిని ఆయన ప్రారంభించారు. అనంతరం బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఆయన పేర్కొన్నారు. తాను సైతం ప్రభుత్వ పాఠశాలల్లోనే తెలుగు మీడియం చదివానని గుర్తు చేశారు. రాష్ట్రంలోని 26 వేల పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేసి వాటిలో మౌలిక సౌకర్యాలు కల్పించామన్నారు. రామడుగు గ్రామంలో రూ.30లక్షలతో నిర్మించే హనుమాన్ మందిరం నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, మాజీసర్పంచ్ మిట్టపల్లి గంగారెడ్డి, మహేందర్, సుభాష్, వీడీసీ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

ధర్పల్లి, జూన్ 12: మండలంలోని రామడుగు గ్రామంలో గల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ స్కూల్ యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల ప్రారంభంలోనే విద్యార్థులకు నోట్‌బుక్స్ స్కూల్ డ్రెస్‌లు పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. గ్రామంలోని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, మహేందర్, మహిపాల్ పాల్గొన్నారు.

రుద్రూరు : బడి బాట కార్యక్రమంలో భాగంగా రుద్రూరు మండల కేంద్రంలోని జెడ్‌పీహెచ్‌ఎస్ (బాలికల), రాణంపల్లి, అక్బర్‌నగర్ గ్రామాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమాలలో ఎంపీపీ అక్కపల్లి సుజాత నాగేందర్, జడ్పీటీసీ నారోజి గంగారాం, ఎంపీడీవో సురేష్ బాబు, తహసీల్దార్ వెంకటేశం, ఎంఈవో శాంతకుమారి, ఏపీఎం భాస్కర్, మాజీ సర్పంచ్ తీగుళ్ళ గంగామణి వరప్రసాద్ పాల్గొన్నారు.

మోస్రా: మండలంలోని చింతకుంట గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో డ్వాక్రా మహిళా సంఘం ఆధ్వర్యంలో కుట్టుమిషన్ ద్వారా ఏకరూప దుస్తులు కుట్టిన పాఠశాల దుస్తులను ఎంపీడీవో ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం ముఖీమ్, ఎంపీవో రఫీ, ఎంపీటీసీ రవి, ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, విజయ్, పంచాయతీ కార్యదర్శి భూమేష్, డ్వాక్రా సీసీలు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బీ) ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, బర్ధిపూర్ సొసైటీ చైర్మన్ రామకృష్ణలు విద్యార్థిని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత విద్యాభ్యాసం చేసి మంచి ప్రతిభ చూపాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజలింగం, ప్రధానోపాధ్యాయులు సంధ్యానాయక్, ఫిజికల్ డైరెక్టర్ విద్యాసాగర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: డొంకేశ్వర్, నూత్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో తహసీల్దార్ వెంకటరమణ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీడీసీ క్యాషియర్ గంగారెడ్డి, ఎంపీటీసీ గంగామణి, సంజీవ్, ఉపాధ్యాయులు, పాఠ శాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మోపాల్: పాఠశాలలు ప్రారంభం కావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం యూనిఫాం, నోట్‌బుక్స్‌లను పంపిణీ చేశారు.

బోధన్‌లో కమ్మ సంఘం సంబరాలు

బోధన్‌రూరల్,జూన్12: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎన్‌టీ రామారావు, చంద్రబాబు నాయుడు అభిమానులు, కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్‌టీ రామారావు విగ్రహనికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టీ రామారావు, చంద్రబాబు నాయుడు అభిమానులు, కమ్మసంఘం సభ్యులు బాణాసంచాలు కాల్చి సంబరాలు నిర్వహించారు. చంద్రబాబు నూతన ప్రభుత్వానికి బోధన్ ప్రాంతవాసుల తరపున అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు పల్లెంపాటి శివన్నారాయణ, గాంధీ, తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్‌వీ హన్మంత్ రావు, ఉపాధ్యక్షులు పావులూరి వెంకటేశ్వర్‌రావు, బోదన్ పార్టీ ఇన్‌చార్జి గోపాల్ రెడ్డి, బీజేపీ నాయకులు అడ్లూరి శ్రీనివాస్, ఈవీ రంగారావు, బోధన్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు పోశెట్టి, బాన్సువాడ యువజన కాంగ్రెస్ నాయకులు బానోత్ రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాశంకర్, నాగేశ్వర్‌రావు, పులి శ్రీనివాస్, బిక్ల రామ్మోహన్, స్థానిక నాయకులు గాంధీ, డాక్టర్ సునీల్ కుమార్ చౌదరి, వెల్లంకి శ్రీనివాస్ రావు, వేములపల్లి రామ్మూర్తి, రామ్మోహన్ రావు, ముప్పానేని అప్పారావు, బాలస్వామి, సాయిపటేల్, కృష్ణారెడ్డి, పాండు, సచిన్, యుసుఫ్, షకీల్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న మొరం టిప్పర్

డిచ్‌పల్లి, జూన్ 12: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బర్ధిపూర్ బైపాస్ రోడ్డు మీదుగా నిజామాబాద్ వెళ్తున్న కామారెడ్డి డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సును అతివేగంగా రాంగు రూట్‌లో వచ్చిన మొరం టిప్పర్ ఢీకొంది. ఈ ఘటనలో కామారెడ్డి డిపోకి చెందిన బస్సు ముందు భాగం ధ్వంసమైంది. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో తృటిలో ఘోర రోడ్డు ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఆర్టీసీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయని కామారెడ్డి ఆర్టీసీ అధికారి తెలిపారు. ఆర్టీసీ బస్సు కండక్టర్ నర్సయ్య 108కు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది స్పృహ తప్పిన డ్రైవర్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటన జరగగానే టిప్పర్ డ్రైవర్ పరార్ అయ్యారు. ప్రమాదాలకు కారణమవుతున్న మొరం టిప్పర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : ఎంపీపీ

కోటగిరి,జూన్12: ప్రభుత్వ పాఠశాల్లోనే విద్యార్థులకు అన్ని రకాల వసతులతో కూడిన నాణ్యమైన విద్య లభిస్తుందని కోటగిరి ఎంపీపీ సునీత పేర్కొన్నారు. కోటగిరి ఉమ్మడి మండలంలోని కోటగిరి, పొతంగల్ పాఠశాలల్లో బుధవారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. సరస్వతి దేవికి పూజలు నిర్వహించి విద్యార్థులకు పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, ఎంపీవో మారుతి, ఎంపీటీసీ వీరేశం, ఐకేపీ ఏపీఎం బస్వంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు, సాయిలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'మౌలిక సదుపాయాలు కల్పించండి'

వర్ని, జూన్12: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని పీడీఎస్‌యూ వర్ని ఏరియా మండల నాయకులు శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం వర్ని మండల కేంద్రంలోని విద్యావనరుల అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో విచ్చలవిడిగా పాఠ్య పుస్తకాలు, దుస్తులు విక్రయిస్తున్నారని, అలాంటి పాఠశాలల్లో సోదాలు జరిపి పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివశంత్, యాసిన్, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు దేశ నాయకుల చిత్రపటాల వితరణ

ఆర్మూర్‌రూరల్, జూన్12: మండలంలోని కోమన్‌పల్లి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు దేశనాయకుల చిత్రపటాలను బుధవారం పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గోపాల్ వితరణ చేశారు. నాయకుల చిత్రపటాలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవితకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలలో దేశనాయకుల చిత్రపటాలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు దేశనాయకుల చరిత్ర, వారి నాయకత్వ లక్షణాలను తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షుడు లావణ్య, ఉపాధ్యాయులు రాజేందర్‌గౌడ్, చిన్నయ్య, భగవంత్‌రావు, వినోద్‌కుమార్, జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరిలో వర్షం

కోటగిరి,జూన్12: కోటగిరి మండలంలో బుధవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జూన్ 12: మాక్లూర్ గిరిజన సంక్షేమ మినీ గురుకులంలో ఒకటో తరగతిలో కొత్త అడ్మిషన్లు, రెండో తరగతిలో 1, ఐదవ తరగతిలో 6 మిగిలిన సీట్లకు ఎస్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కో-ఆర్డినేటర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల ఎస్టీ బాలికలు సంబంధిత పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని మాక్లూర్ మండలానికి చెందిన విద్యార్థులకు తొలిప్రాధాన్యం ఉంటుందన్నారు. సీట్లు మిగిలిన పక్షంలో ఇతర మండలాలకు అవకాశం ఇస్తామని ఆయన తెలిపారు. ఒకటో తరగతిలో ప్రవేశం కోసం చేరే విద్యార్థులు 5 సంవత్సరాల వయస్సు పూర్తి చేసుకున్న బాలికలు ఆధార్‌కార్డు, జనన, కుల, ఆదాయ ధృవపత్రాలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో ఈనెల 20 వరకు దరఖాస్తులను సమర్పించాలని, లాటరీ పద్ధతిన ఎంపిక ఉంటుందన్నారు.

గగ్గుపల్లిలో విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

ఆర్మూర్‌టౌన్ , జూన్12: మండలంలోని గగ్గుపల్లి గ్రామశివారులో వ్యవసాయ భూమిలో విద్యుత్‌షాక్‌తో గ్రామానికి చెందిన రాంపూర్ పోశన్న(55) అనే వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బోర్గంలో వాటర్‌ట్యాంకుపై పిడుగు

మాక్లూర్ జూన్12: మండలంలోని బోర్గం(కె) గ్రామంలో బుధవారం సాయంత్రం భారీ వర్షంతో పాటు పిడుగు పడింది. గ్రామానికి చెందిన గంగాధర్ ఇంటి మీద గల వాటర్ ట్యాంక్‌పై పిడుగు పడింది. దీంతో వాటర్ ట్యాంకుకు నాలుగు రంధ్రాలు ఏర్పడి ట్యాంక్ ధ్వంసమైంది. పిడుకు పాటుతో పైకప్పుకు గుంతలు పడింది. ఎలాంటి ప్రమాదం, ప్రాణనష్టం జరగలేదు.

'పశువులను అక్రమ రవాణా చేస్తే చర్యలు'

ఇందల్వాయి, జూన్ 12:పశువులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై మనోజ్‌కుమార్ అన్నారు. ఇందల్వాయి మండల కేంద్రంలో ప్రతి బుధవారం పశువుల సంత జరుగుతుంది. ఈ సంతలో పశువుల క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. బుధవారం రోజు పశువుల సంతను పోలీసులు నిలిపివేశారు. పోలీసులు పశుసంవర్ధక శాఖ అధికారులు ఉదయం నుండి పశువుల సంత జరిగే స్థలంలో ఉండి అక్కడ క్రయ విక్రయాలు జరుగకుండా చూసుకున్నారు. భారీగా పశువుల అక్రమ రవాణా జరుగుతుందని దీంతో ఇక్కడ పశువుల సంత నిర్వహించరాదని అన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

గౌడ సంఘం అధ్యక్షులుగా చేపూర్ రాజేందర్‌గౌడ్

సిరికొండ జూన్ 12 : సిరికొండ గౌడ సంఘం అధ్యక్షులుగా చేపూర్ రాజేందర్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిరికొండలో బుధవారం సమావేశమైన గౌడ కులసంఘ సభ్యులు పలు విషయాలపై చర్చించి చివరగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చేపూర్ రాజేందర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా ఏ.గణేష్ గౌడ్, వై.రామస్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణగౌడ్, కోశాధికారిగా రాజగౌడ్ ఎన్నికయ్యారు. వీడీసీ సభ్యులుగా పెంటయ్యను ఎన్నుకున్నట్లు నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికయిన రాజేందర్‌గౌడ్ తెలిపారు.

అసంపూర్తిగా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు

నిధులు మంజూరైనా.. తప్పని తిప్పలు


కొండూర్‌లో కూలిపోయిన పాఠశాల ప్రహరీ

సిరికొండ జూన్ 12 : రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడానికి మౌళిక సదుపాయాలను పునఃరుద్దరించాలనే లక్ష్యంతో మరమ్మతు పనులకు నిధులు విడుదల చేసింది. పనులు మాత్రం పూర్తి కాలేదు. అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంలో మండలానికి ప్రభుత్వం వివిధ మరమ్మతు పనులకు గాను రూ.కోటి 31 లక్షలు మంజూరు చేసింది. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి పూర్తి చేయించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. 37 ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్‌ల మరమ్మతు, అన్ని పాఠశాలల్లో ప్యూరీఫైడ్ తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు, కరెంటు సౌకర్యం కల్పించడానికి, మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత విద్యార్థులు చేతులు కడుక్కోవడానికి కుళాయిలను బిగించడం లాంటి పనులను పూర్తి చేయించడానికి ఈ నిధులను మంజూరు చేసింది. అన్ని పాఠశాలల్లో కరెంటు పనులను పూర్తిచేయించిన అధికారులు మిగిలిన పనులు పూర్తి చేయించడంలో విఫలమయ్యారు. బుధవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. పనులేమో అసంపూర్తిగానే ఉన్నాయి.

నిజామాబాద్ రూరల్: వేసవి సెలవుల తర్వాత ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. బుధవారం రూరల్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు తెరచుకున్నాయి. విద్యార్థులు బడిబాట పట్టారు. వేసవి సెలవులకు ముందే ప్రభుత్వం సర్కారు బడుల్లో మౌళిక సదుపాయాలు, చిన్నపాటి మరమ్మతుల కోసం అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద నిధులు మంజూరుచేసింది. అందులో భాగంగా రూరల్ మండలంలో రూ. 1.69 కోట్ల నిధులు మంజూరుచేశారు. అందులో 18 పాఠశాలల మరమ్మతులు చేయాలని సూచించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వీఓఏలతో కూడిన బృందం పనులను పర్యవేక్షిస్తుంది. అయితే రూరల్ మండలంలోని గ్రామాల్లో ఏ గ్రామంలో కూడా పనులు పూర్తికాలేదు. 80 శాతం పాఠశాలల్లో సగం పనులు కూడా పూర్తికాలేదు. మూత్రశాలలు, తాగునీటి కుళాయిలు, విద్యుత్ పరికరాలు, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, స్విచ్‌బోర్డులు ఏర్పాటు, ఫ్లోరింగ్, వాల్ మరమ్మత్తులు, మూత్రశాలలు, కంపౌండ్ నిర్మాణ పనులు పంటివి చేపట్టారు. గుండారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సగం పనులు కూడా పూర్తికాలేదు. ప్రధానోపాధ్యాయులు సైతం చెట్ల కింద కుర్చీలు వేసుకని కూర్చున్నారు. కొత్తపేట ప్రైమరీ పాఠశాలలో పనులు వారం రోజుల క్రితం పనులు ప్రారంభించారు. చాలా పాఠశాలల్లో విద్యుత్ మరమ్మత్తులు పూర్తిచేయలేదు.

డిచ్‌పల్లి:మండలంలోని ఘన్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తి స్థాయిలో కాకపోవడంతో పనులు నెమ్మదిగా సాగుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. తాత్కలికంగా విద్యార్థులను ఎస్సీ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో తాత్కలిక తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు బోధన అందించేందుకు బ్లాక్‌బోర్డు సైతం లేకపోవడంతో ఉపాధ్యాయులు ఇక్కట్లు పడ్డారు.


కొత్తపేట్‌లో కొనసాగుతున్న మరమ్మతు పనులు

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి : జడ్పీచైర్మన్


పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న జడ్పీచైర్మన్

నందిపేట, జూన్12: ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులు భవిష్యత్ తరాలకు మార్గదర్శకులు కావాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా పరిషత్ చైర్మెన్ దాదన్నగారి విఠల్‌రావు కోరారు. బుధవారం నందిపేట మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1221 ప్రభుత్వ పాఠశాలలు, 496 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాల్లోనే మెరుగైన ఫలితాలు రావాలని విఠల్‌రావు సూచించారు. అందరు 10 గ్రేడు సంపాదించాలని అందుకోసం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపా ధ్యాయులు శ్రమించాలని కోరారు. జిల్లాలోని బోర్గాం (పి) ప్రభుత్వ పాఠశాల రాష్ట్రంలోనే ఐదోస్థానంలో నిలిచిందని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, మండల తహసీల్దార్ ఆనంద్ కుమార్, మండల కో-ఆప్షన్‌సభ్యులు సయ్యద్ హుస్సేన్, ఎంపిటీసీ సభ్యులు ఎలిగేటి రాజు, టీఆర్ఎస్ నాయకులు ఏర్రం ముత్యం, మజారోద్దిన్, కాంగ్రెస్ నాయకులు మాన్పూర్ భూమేష్, ఉపాధ్యా యులు తధితరులు ఉన్నారు. మాక్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు బుధవా రం పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేశారు.

పట్టుదలతో చదవాలి : అదనపు కలెక్టర్

ఆర్మూర్‌రూరల్, జూన్12: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. బుధవారం ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో పాఠశాలల పునప్రారంభం సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించ డంతో పాటు విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా మన్నారు. అనంతరం ఆర్మూర్ పట్టణంలోని రాంమందిర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హాజరై పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, ఎంపీడీవో సాయిరాం, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రాజు, వైస్‌చైర్మన్ మున్న, ఎంఈవో రాజగం గారాం, కౌన్సిలర్ రాజు, పాఠశాల హెచ్‌ఎంలు చలం, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మచ్చర్లలో పాఠ్యపుస్తకాల పంపిణీ...

మండలంలోని మచ్చర్ల గ్రామంలో బుధవారం విద్యార్థు లకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను ఎంపీపీ పస్కనర్సయ్య పంపిణీ చేశారు. గోవిందపేట్ గ్రామంలో ఎంపీటీసీ రాజ్‌కుమార్, సొసైటీ చైర్మన్ మహిపాల్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఏపీఎం గంగారాం, హెచ్‌ఎంలు కిషన్, పండరి, తదితరులు పాల్గొన్నారు.

'ఐసీడీఎస్ పీడీ తన వైఖరిని మార్చుకోవాలి'

నిజామాబాద్ అర్బన్, జూన్ 12: ఐసీడీఎస్ పీడీ రసూల్‌బీ తన వైఖరిని మార్చుకోవాలని, లేదంటే సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, ఉపాధ్యక్షుడు రమేష్‌బాబులు అన్నారు. బుధవారం ఈ మేరకు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడి ఉద్యోగులు అధికభాగం సీఐటీయూలోనే ఉన్నారని ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రశ్నిస్తున్నందున సీఐటీయూ యూనియన్‌పై కక్షతో ఉద్యోగులను యూనియన్ మారాలని, పోరాటాలు చేయవద్దని ఒత్తిడి తెస్తున్నారని ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు పూర్తిగా విరుద్ధమని ఆమె అన్నారు. మరొక సంఘానికి వత్తాసు పలుకుతూ కక్షపూరితంగా కావాలనే సీఐటీయూ నాయకుల అంగన్‌వాడి కేంద్రాలను తనిఖీ చేస్తూ వారిని మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఇప్పటికైనా ఆమె తన వైఖరిని మార్చుకోవాలని లేదంటే తగిన గుణపాఠం తప్పదన్నారు. అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో అంగన్‌వాడి యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దేవగంగు, స్వర్ణ, చంద్రకళ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆవును చంపిన కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

రుద్రూరు, జూన్ 12 : ఆవును చంపిన కేసులో ఇద్దరికి 50 రోజుల కఠిన కారాగార శిక్ష, జరిమానా విధించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2017 మార్చి 17వ తేదీన అర్ధరాత్రి రుద్రూరు మండల కేంద్రంలోని అంబం కాలనీలో జేఎన్‌సీ కాలనీకి చెందిన ఇద్దరు గైనికృష్ణ, ఎం.డి.హైమద్ ఖురేషిలు ఇద్దరు ఒక ఆవును చంపారు. ఈ క్రమంలో ఘటనను చూసిన కానిస్టేబుల్ రవికుమార్ వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా అక్కడి నుంచి పారిపోయారు. ఈ విషయమై రుద్రూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి వారిని పట్టుకున్నారు. ఈ కేసులో బుధవారం బోధన్ మెజిస్ట్రేట్ ఆ ఇద్దరు నిందితులకు 50 రోజుల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించడం జరిగిందని పోలీసులు తెలిపారు.

నీటి లీకేజీపై స్పందించిన అధికారులు


పనులు నిర్వహిస్తున్న దృశ్యం

మోస్రా,జూన్12: మండలంలోని చే నెంబర్ తండా(దుబ్బ)లో మిషన్ భగీరథ నీటి లీకేజీ వార్తకు సంబంధిత శాఖ అధికారులు స్పందించి, మరమ్మతు చేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ సాత్విక, పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, అంగన్‌వాడీ టీచర్ సుజాత పాల్గొన్నారు.

కొనసాగుతున్న భగీరథ సర్వే

మోస్రా: మండల కేంద్రంతో పాటు మండలంలోని గోవూర్, చే నెంబర్ తండా(దుబ్బ), చింతకుంట, తిమ్మాపూర్ గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వే కొనసాగుతుంది. నీరు వృథాపోకుండా ఇంటి నెంబర్ కలిగిన ప్రతి ఇంటి యజమాని ఆధార్ కార్డు ద్వారా సర్వే చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్, ఎంపీవో రఫీ, పంచాయతీ కార్యదర్శులు భూమేష్, మహేశ్వరి, మతిబ్, ప్రేమ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సిరికొండ :మిషన్ భగీరథ కార్యక్రమంలో కుళాయిలు రాకుండా ఉన్నా కుటుంబాలెన్ని అని తేల్చడానికే గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం మంచినీటిని అందించాలనే లక్ష్యంతోనే గ్రామాల్లో సర్వే చేస్తున్నట్లు అధికారులు చెపుతున్నారు. వర్షాకాలం ప్రారంభయినందున గ్రామాల్లో తాగునీటి సరాఫరాలో ఎలాంటి తేడాలు రాకుండా పంచాయతీల్లో సిబ్బందిని అప్రమత్తత చేయాలని గ్రామీణ నీటి సరాఫరాల ఇంజనీరింగ్ అధికారి అర్షద్ సిబ్బందికి సూచించారు. మండలానికి చెందిన సిబ్బందిని బుధవారం సిరికొండలో సమావేశ పరిచారు.

నిజామాబాద్ రూరల్:రూరల్ మండలంలోని గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం పనితీరును అధికారులు పరిశీలించారు. ఆయా గ్రామాల్లో తాగునీటి లభ్యతపై పంచాయతీ కార్యదర్శులు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. బుధవారం రూరల్ మండలంలోని పలు గ్రామల్లో జరుగుతున్న పనులను డీఎల్‌పీవో, ఎంపీడీవో మధురిమ పరిశీలించారు.

డొంకేశ్వర్:మండలంలోని 13 గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. గ్రామంలో ప్రతీ ఇంటికి తిరుగుతూ నలా కనెక్షన్ వివరాలు తెలుసుకుంటున్నారు. మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా, వచ్చిన వాటర్ సరిపోతున్నాయా అనే వివరాలను నమోదు చేసుకుంటున్నారు. మిష న్‌భగీరథ ఈ యాప్‌లో నమోదు చేస్తున్నారు.

పూర్తయిన ఈసెట్ కౌన్సెలింగ్

నిజామాబాద్ అర్బన్, జూన్ 12: ఈసెట్ మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయినట్లు జిల్లా సమన్వయకర్త శ్రీరాంకుమార్ తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న ఈసెట్ మొదటి విడత సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. బుధవారం స్లాట్‌బుక్ చేసుకున్న 164 మంది విద్యార్థులకు ధృవపత్రాల పరిశీలన పూర్తయిందని ఈనెల 14 వరకు విద్యార్థులు వెబ్‌ఆప్షన్‌లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

నీట్ పరీక్ష లీకేజీపై సమగ్ర విచారణ జరపాలి

నిజామాబాద్ అర్బన్, జూన్ 12: దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు రఘురాం నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని రైల్వే స్టేషన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని లీకేజీ బాధ్యులు ఎవరైనా కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అంజలి, శిరీష, సుధాకర్, నవీన్ పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం..

నీట్ పరీక్ష ఫలితాల గందరగోళం పై ఏబీవీపీ ఆధ్వర్యంలో బాధ్యులైన అధికారుల దిష్టిబొమ్మను బుధవారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఇందూరు విభాగ్ కన్వీనర్ శశి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగిన నీట్ పరీక్ష ఫలితాల గందరగోళం వల్ల ఎంతో మంది విద్యార్థుల జీవితాలు గందరగోళంగా మారాయన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

రెంజల్,జూన్12: మండలంలోని కళ్యాపూర్ గ్రామానికి చెందిన చింత ప్రదీప్‌కుమార్ క్యాన్సర్‌తో ఆరునెలలు పోరాడి గత నెల 29న తుదిశ్వాస విడిచాడు. ప్రదీప్ మృతిచెందడంతో ఆయన కుటుంబానికి 10వ తరగతి మిత్రులు అండగా నిలిచారు. తమతో 10వ తరగతి వరకు కలిసి చదివిన ప్రదీప్ కుటుంబానికి మిత్రులు 22వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.


బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మిత్రబృందం

బస్టాండ్‌లో మహిళ కాళ్ల పైనుంచి వెళ్లిన బస్సు

పెర్కిట్, జూన్12: ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం బస్సు ఎక్కే సమయంలో బస్సు వెనుక చక్రాల కింద కాలు పడి సుజాత అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిసిన వివరాల ప్రకారం నిర్మల్ డిపోకు చెం దిన బస్సును డ్రైవర్ వెనక్కి తీస్తుండగా అదే సమయంలో మహిళ బస్సు ఎక్క డానికి వెళ్ళగా అదుపుతప్పి కింద పడిపోయింది. వెనుక చక్రాల కిందికి మహిళ కాలు వెళ్ళడంతో కాళ్ళ పైనుంచి బస్సు కదలడంతో కాలు నుజ్జునుజ్జు అయింది. వెంటనే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆ మహిళను నిజామాబాద్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

దుబాయిలో గుండెపోటుతో కొత్తపల్లి వాసి మృతి

ముప్కాల్, జూన్12:బతుకుదెరువు కోసం దుబాయి వెళ్ళిన కోట భూమేశ్వర్ (49) గుండెపోటుతో మృతిచెందినట్లు తెలిసింది. గత 30ఏళ్ల దుబాయిలో ఉద్యోగం చేస్తున్న భూమేశ్వర్ గత నెల స్వగ్రామానికి వచ్చి తిరిగి వెళ్ళాడు. ఆదివారం ఉదయం నిద్రలేచి రూంలో ఇతరులతో మాట్లాడుతుండగా గుండె నొప్పితో పడిపోగా సీపీఆర్ చేసి ఆసుపత్రికి తరలించగా మరోసారి గుండెపో టు రాగా మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

టిప్పర్ డ్రైవర్‌కు 6 నెలల జైలు

ఎడపల్లి, జూన్ 12: అజాగ్రత్తగా టిప్పర్ వాహనం నడిపి బాలుడి మరణానికి కారణమైన వ్యక్తికి బోధన్ కోర్టు 6 నెలల సాదారణ జైలు శిక్ష విధించింది. వివరాల్లోకి వెలితే 2017 సంవత్సరంలో ఎమ్మెస్సీ ఫారం గ్రామానికి చెందిన ఎండీ అయాన్ అనే బాలుడిని టిప్పర్ వాహనాన్ని గొల్లగుట్ట తండాకు చెందిన బుక్యా శ్రీను అతివేగంగా నడుపుతూ బాలుడిని ఢీ కొట్టడంతో బాలుడు అక్కడిక్కడే మరణించింది. అదనపు జూనియర్ సివిల్ జడ్జీ శివ ప్రసాద్, బుక్యా శ్రీనుకు 6 నెలల సాధారణ జైలు శిక్ష విధించారు.

'రైతుల సమస్యలను పరిష్కరించాలి'

నిజామాబాద్ అర్బన్, జూన్ 12: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ, విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు అందించాలని కోరుతూ అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి దేవరాంలు మాట్లాడుతూ రుణమాఫీని ఏకకాలంలో పూర్తి చేస్తామని చెప్పి ఇప్పటికి చేయలేదన్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	: రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72,500	రూ.66,800	రూ.910

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : మనమే (10.20, 10.20)
మంజియా (హిందీ)1.35,
: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (4.20)
: సత్యభామ (7.25)
స్క్రీన్-2 : బ్యాడ్ బాయ్స్ (10.30, 4.30, 10.30)
: మనమే (1.15, 7.15)
స్క్రీన్-3 : సత్యభామ (11.25, 10.40)
: భజే వాయు వేగం (2.20)
: మంజియా (హిందీ) (5.10 7.55)
స్క్రీన్-4 : గోల్డ్ నెంబర్ 1 (10.30)
: లవ్‌మౌలీ (1.20) మనమే (4.20)
: రక్షణ (7.40,) గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (10.45)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మనమే (10.50, 1.45, 4.40, 7.35, 10.30)
స్క్రీన్-2 : రక్షణ (10.25)
: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (1.30, 7.30)
: సత్యభామ (4.30)
స్క్రీన్-3 : భజే వాయువేగం (10.30)
: లవ్‌మౌలీ (10.40)
: బ్యాడ్ బాయ్స్ (1.45, 7.45)
: రక్షణ (4.30)
: సత్యభామ (10.30)

దేవి : గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : రక్షణ (11.00, 6.00)
వెపన్ (2.00, 9.00)
విజయ్ : మనమే (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్